

మహాకవి

కొడవటిగంటి కుటుంబరావు

పాత్రలు :

[భటుడు, గాత్రసేవకుడు, నిర్వాహకుడు, భద్రుడు, హాలుడు, ప్రాదేశికుడు, పుష్యగుప్తుడు, సుశ్రుతుడు, లాతువు, మహాకవి, సేవకుడు, అతిథులు, మిలిగినవి స్పష్టం.]

(నాటక ప్రదర్శనం జరుగుతోంది)

భటు : (గట్టిగా) గాత్ర సేవకా ? గాత్ర సేవకా ... (తనలో) ఓరి వీడి కడుపు మాడా ... తప్పతాగి, చింతనిప్పులల్లే కళ్ళు వాడూ—వొస్తున్నాడు.

గాత్ర : (మైకంతోపాడుతూ)

- తాగినవోడే ధన్యుడురా పద
తాగినవోడే ధన్యుడురా—తప్ప
తాగినవోడే ధన్యుడురా—

ఆఁ ఎవరా కేకవేసేదీ ? గాత్తర సేవకుడితో పనేంటీ అంట. ఆడితో ఓరికి పనొచ్చిందీ ?

భటు : నీ కడుపుమాడా. నీకోసం అంతటా యెతికినానే. సినరాణి వాసవదత్తమ్మగోరు స్నానానికి బయల్దేరాలని తొందరపడతా వుండిరి. ఆ మెగారి యేనిగె బద్దరవతి అవుపించదాయె. నిన్నుజూడబోతే యీడ తాగి తందనాలేస్తావుంటివి.

గాత్ర : అంతే అంతే. అది తాగింది. దాని మొగుడు తాగడు. నే తాగాను. నువు తాగావు. అందరూ తాగారు.

భటు:అందరిమాటా దేనికిలే? నువ్వు యిక్కడెందుకు తందానాలాడుతున్నావ్ ? యేనిగె' నెందుకు తేలేదు ?

గా : నే నిక్కడే తందానాలాడుతున్నా. ఇక్కడే తాగుతున్నా.

భ : చాలించు నీ వాగుడు. వెంటనే బద్దరవతిని తీసుకురా.

గా : రమ్మనూ. ఏయ్ బద్దరవతీ. రా, వచ్చెయ్ ... అంకుశంతాకట్టు పెట్టేసినాను. ఏంజేతును ?

(ప్రేక్షకులు గొల్లున నవ్వుతారు)

భ : అంకుశంతో పనేమిటి ? బద్దరవతి బొహుసాదువు. వెళ్ళివెంటనే తీసుకురా.

గా : రమ్మనూ. ఏయ్ బద్దరవతీ, రా, వచ్చెయ్...దాని చంద్రమాల తాకట్టు పెట్టేసినాను. ఏంజేతును ?

(ప్రేక్షకుల నవ్వులు)

భ : దానికేంలే ? మెళ్లో దానికో పూలమాల వేద్దాం. నువు వెంటనే వెళ్ళి దాన్ని తీసుకురా.

గా : రమ్మనూ. ఏయ్. బద్దరవతీ, రా, వచ్చెయ్...దాని గంటకూడా తాకట్టు పెట్టేసినాను. ఏంజేతును ?

భ : జలకమాడబోయే ఏనిగెకి గంటెందుకురా, దాన్ని వెంటనే తీసుకురా.

గా : రమ్మనూ. ఏయ్. బద్దరవతీ, రా రా... దాని చెరణాకోలకూడా కుదవ పెట్టేసినాను.

భ : బద్దరవతికి చెరణాకోల దేనికిరా. దాన్ని వెంటనే తీసుకురారా.

గా : ఓ, తెస్తా. ఏయ్ బద్దరవతీ, రా... అరెరే...

భ : అరెరే యేంది ?

గా : అరెరే నేను –

భ : నువ్వేంది ?

గా : అరెరే బద్దరవతి –

భ : బద్దరవతికేంది ? --

గా : బద్దరవతినికూడా కుదవెట్టేసినాను.

(ప్రేక్షకుల నవ్వులు)

భ : నిన్నేమని ఏంలాభంలే. రాజవాహనం తాకట్టు పెట్టుకుని నీకుకల్లుపోసిన దానిదే అసలు తప్పు.

గా : అసలుకుమోసం రాకుండా చూసుకోమని నేను చెప్పనే చెప్పా.

భ : (ఉలిక్కిపడి) ఏంటా చప్పుడు ?

గా : తెల్సు. తెల్సు. బద్దరవతి కల్లుదుకాణంనుంచి తప్పించుకు పారిపోతోంది.

భ : ఏమన్నావ్ ?

గా : వత్సరాజు వాసవదత్తతో సహా పారిపోయాడు.

భ : శుభం ఇంక నువు నీ యిష్టం వొచ్చినట్టు తాగి తందనాలాడొచ్చు.

గాత్ర: (పద్ధతిమార్చి) ఏయ్, ఎవరుతాగింది? ఆనందం దేనికనుకున్నావ్ ? మేమంద రమూ యౌగంధరాయణులవారి చారులం. మమ్మల్ని వారు ఆయా స్థానాలలో ఉండమన్నారు. నేనిక్కడ వుండి నాఅనుచరులకు సంకేతాలిస్తున్నాను. చూడు, కుబుసాలు విడిచిన కోడెతాచుల్లా వాళ్ళంతా ఎలా అటూ ఇటూ పరిగెత్తుతున్నారో.

(యుద్ధకోలాహలం)

(గొంతెత్తి) మిత్రులారా, ప్రభువుల ఉప్పుతిని వారికొరకు యుద్ధంలో ప్రాణాలు వదలనివారు నీచపు చావు చచ్చి నరకానికి పోతారు. (తనలో) ఆహా, అరుగో యౌగంధ రాయణులవారు. పిచ్చివానివేషం విసర్జించి, ఒకచేత ఖడ్గమూ, రెండవచేత బంగారుడాలూ ధరించి, వత్సరాజును వెన్నంట యత్నించే సైనికులను నిలవేసి, చించి చెండాడుతున్నారు, ఆహా. ఏమి ఆయన పరాక్రమం. ఆయన ఖడ్గానికి ఎన్నిఏనుగులు బలి అవుతున్నాయి. ఎందరుసైనికులు, ఎందరు అశ్వికులు... అయ్యో, హతవిధీ, యౌగంధరాయణుల వారు చిక్కిపోయారు. ఆయనఖడ్గాన్ని విజయసుందరమనే ఏనుగు విరిచేసింది. ఆయనకు బదులు నేను వెళతాను.

(ప్రేక్షకుల హర్షధ్వానాలు)

(మర్నాడు ఒక సత్రంలో)

నిర్వా : ఒసేగౌతమీ, మల్లికా ... భద్రా, అంతా ఎక్కడ చచ్చారర్రా ? రాత్రికి రాత్రే, ఆడా మగా అంతా కలిసి, యవనులమీదికి యుద్ధానికి వెళ్ళారా ఏం ? (పళ్ళు బిగబట్టి) అడుగో వొస్తున్నాడు భద్రుడు—(అవులిస్తూ.) నీ నోరు బడ ... ఇంత పొద్దెక్కి ఇప్పుడు నిద లేస్తున్నావట్రా ?

భద్రు : ప్రదోషాన వచ్చి అబద్ధాలాడకండి. నేను కొంచెం ఆలస్యంగా లేచినమాట నిజమేగాని ఇంకా సూర్యోదయమే కాలేదు. అదీగాక రాత్రి నాటకానికి వెళ్ళాను.

నిర్వా: అఘోరించలేకపోయావు. నీ వాలకం చూస్తే, నాటకం చూడటమేకాదు. అందులో వేషంకూడా కట్టినట్టుంది. అదీగాక. పద, యాత్రికులు వచ్చేవేళ అయింది. నీ పని చూసుకో. ఇంకో ఘడియలో అతిథులులేచి అది కావాలి, యిదికావాలని అడుగుతారు. అడగరూ మరి ? అడిగినదంతా అమర్చే ధర్మప్రభువు రాజసింహుడుండెగా.

1. అతి : శుభోదయం, శుభోదయం. అప్పుడే మీకు నిత్యకృత్యం ఆరంభమయినట్టున్నదే.

నిర్వా : కృత్యందాకారాలేదు, బాబూ. ఇంకా కృత్యాద్యవస్థలోనే వున్నాను.

1. అతి : రాత్రిచూసిన ఆ నాటకంలో కృత్యాద్యవస్థ అన్నది కనిపించనేలేదు. ఆ యౌగంధరాయణుడు సాలకుణ్ణిపిలిచినది మొదలు నాటకం విడిచిన బాణంలా వెళ్ళిందంటే నమ్మండి. మహాకవి, నాటకాలను గురించి వినటమేగాని, చూచింది లేదు. నిన్న మొదటిసారిగా చూశాను. జన్మ తరించింది. నభూతోనభవిష్యతి.

నిర్వా : నా దగ్గిర చెప్పకండి. యీనాటకాలు వచ్చి సాంకర్యం తెచ్చాయి. నాటకాలు చూసి వచ్చిన వాళ్ళకి చిన్నంతరం పెద్దంతర్యం లేకుండా పోయింది. వాడెవడో ఘటోత్కచుడువేశాట్ట అదేదో నాటకంలో. వాడికి బ్రహ్మార్థం పట్టినంతపని చేశారు. అల్పులమాట అటుంచండి. గొప్పవాళ్లుకూడా వాణ్ణి నెత్తినెక్కిచ్చుకునిలాలనచెయ్యటమా? ఛీ,ఛీ.

1. అతి : అదే నాటకంలో, బాబుగారూ ? దూతఘటోత్కచం అని ఒక నాటకం ఆడారుట—

నిర్వా : మధ్యమ అని యింకో నాటకం ఆడారు. నేరక, బుద్ధి గడ్డితిని, ఆ నాటకం చూశా. రామరామ, అంతా అభూత కల్పన. భారతంలో ఆ కథ ఎక్కడాలేదు.

1. అతి. దూతఘటోత్కచం కూడా కల్పనే. కల్పన అయితేనేమండీ ?

నిర్వా : ఈ కల్పనలు చూశాక భారత రామాయణాది పవిత్ర గ్రంథాలపట్ల ప్రజలకు భక్తి తాత్పర్యాలేమైనా మిగులుతాయా?

2. అతి : (వస్తూ) అలా ఒక్కనాటికి అనకండి. మధ్యమ అన్నది మహారసవత్తరమైన హాస్యనాటిక.

నిర్వా : ఆ నాటకంలో మీకు హాస్యం కనిపించింది కాబోలు, నాకు జుగుప్సతప్ప వేరేమీ కలగలేదు.

2. అతి : మీకు హాస్యం తెలియదన్నమాట. నరభక్షకుడు ఆర్యధర్మాలు పాటించటంలో హాస్యంలేదుటండీ ? ఆబ్రాహ్మణ కుటుంబీకుడు మృత్యుభయంమధ్యా జీవితాశమీదా ఊగిసలాడటంలో హాస్యంలేదూ ? హిడింబకు భర్తమీద మనసుపోయి భోజనంవంకపెట్టి కొడుకును పంపటంలో హాస్యంలేదూ ? అసలు ఏకాదశీ ఉపోషం వున్న మనిషి నరమాంసం పారణ కోరటంలోనే చచ్చేటంత హాస్యం ఉంది కాదుటండీ ?

నిర్వా:(వెటకారంగా) అయ్యా, స్వర్ణకారుడు వచ్చి శ్రోత్రియ బ్రాహ్మణపాత్ర ధరించ

టంలో కూడా తమకు హాస్యం కనిపించిందా ?

2. అతి : కేశవదాసుపాత్ర ధరించింది స్వర్ణకారుడటండీ ? ఎంత నిర్దుష్టమైన నటన. ఎంత గొప్పనటుడు. నిజం బ్రాహ్మడే అనుకున్నాను సుమండీ.

నిర్వా : అయ్యా, మీరు మహాకవి అన్న పెద్ద మనిషి మ్లేచ్ఛులను సయితం మహర్షిని చేస్తాడు. అందుకేగదా, నాటకాల్లొచ్చి సాంకర్యం పెరుగుతోందని నా అఘోరింపు.

3. అతి : ఏ విధమైన సాంకర్యం, ప్రభువులూ ?

1. అతి : నాటకాలను గురించి మాట్లాడుతున్నారు.

3. అతి : తూర్పు తెల్లవారకముందే నాటకాలనుగురించి మాట్లాడటం దేనికి, ప్రభువులూ ?

1. అతి : రాత్రి నాటకం జరిగింది.

3. అతి : అలాగా. నాకు తెలీదు, ప్రభువులూ. రాత్రి నేనువచ్చి చేరేసరికి చాలా పొద్దోయింది. ఇంతకీ ఏం నాటకం, ప్రభువులూ ?

1. అతి : ప్రతిజ్ఞా యౌగంధరాయణం.

3. అతి : అదేంకథో ?

1. అతి : వత్సరాజయినటువంటి ఉదయనుడు అవంతిరాజైన ప్రద్యోత మహాసేనుడి కుమార్తెను, వాసవదత్తను పెళ్లాడే కథ.

3. అతి : అదా ? తెలుసులెండి, బృహత్కథ లోది కాదూ ?

1. అతి : దానికీ దీనికీ కొన్ని మార్పులున్నాయిలెండి.

3. అతి : అయితే వత్సరాజు పాత్రా, వాసవదత్త పాత్రా ఎవరు వేశారో తమకు తెలుసా, ప్రభువులూ ?

2. అతి : వత్సరాజూ, వాసవదత్తా నా ? ఆ పాత్రలు నాటకంలో లేవు, బాబూ.

3. అతి : (నమ్మలేకుండా) వత్సరాజు లేక వాసవదత్తా లేక వారిపెళ్ళి కథ నాటకం ఎలాగయింది, ప్రభువులూ ? మీరు చూసింది మరో నాటకమేమో.

1. అతి : కాదులేవయ్యా, ఆ నాటకమే నాయికా నాయకులు లేకుండా నాటకం రాయటం మహాకవికే చెల్లింది.

3. అతి : ఈ నాటకం కథ కాస్త చెవిని వేస్తారా, ప్రభువులూ ? వింటేగాని నమ్మ శక్యం కాకుండా వుంది.

2. అతి : జరిగింది జరిగినట్లు క్లుప్తంగా చెప్పనా ?

నిర్వా : నే వెళ్ళాలి, కబుర్లువింటూ కూచోటానికి నాకు తీరదు. బోలెడంత పని... నిద్రమత్తు వదిలిందిట్రా, భద్రకా ? అతిథులకు ఏంకావాలో కనుక్కో.

భద్రు : చిత్తం, చిత్తం. అయ్యలూ, ఏమిటి సెలవు ?

3. అతి : మేం చాలా ముఖ్యమైన విషయం ముచ్చటించుకుంటున్నాం. మాకు అడ్డు రాకు.

భద్రు : తమకు నేనెందుకడ్డొస్తా నయ్యలూ? తమగోష్ఠి కానీండి. అనికనే తమపక్క సూస్తాను.

3. అతి : తమరు నాటక కథ సెలవిచ్చారు కాదు.

2. అతి : అందుకే నేనూ వేచివున్నా. కథ వినండి. వత్సరాజు తన వీణతోసహా వింధ్యాటవిలో ఏనుగులవేటకు వెళ్ళాడు.

3. అతి : అడ్డొస్తున్నందుకు క్షమించాలి. యీ నాటకంలో వత్సరాజు పాత్రే లేదన్నారు ?

2. అతి : మీ సందేహం సమంజసమైనదే. అయితే యీ నాటకంలో వచ్చిన చిక్కేమిటంటే ... వత్సరాజు పాత్ర రంగస్థలంమీదికి రాకపోయినప్పటికీ ప్రేక్షకులు అతన్నిగురించి ఆలోచించకుండా ఉండలేరు. మరి కథ వినండి. వత్సరాజు వింధ్యాటవికి వెళ్ళాడన్నానుకాదూ ! ఆ వింధ్యాటవిలోని ఒక వనంలో –

1. అతి : నాగవనంలెండి. అక్కడ ఏనుగులు జాస్తి.

2. అతి : అవును. నాగవనంలో ప్రద్యోత మహాసేనుడు ఒక మాయఏనుగును పెట్టాడు. దానికోసం వత్సరాజు వస్తే బందీగా పట్టుకోవాలని మహాసేనుడి ఎత్తు. ఈ సంగతి యౌగంధరాయణుడికి తెలిసి సాలంకుడనేవాణ్ణి పిలిచి –

భద్రు : ఆ సాలంకుడి యేషం కట్టినవాడు నా స్నేహితుడే, అయ్యలూ.

2. అతి : అలాగట్రా ?

1. అతి : నిజంగానే. వాడుకూడా చక్కగా అభినయించాడుసుమా.

నిర్వా : (వస్తూ) అప్రాచ్యుడా, బోలెడంత పనిపెట్టుకుని పెద్దలతో మంతనాలాడతావుట్రా ? అయ్యలారా, తమరు పనికుర్రాళ్లని పాడుకానివ్వకండి, తమకు పుణ్యం ఉంటుంది.

1. అతి : వాణ్ణి మేం పాడుచెయ్యటమేమిటి? వాడే మమ్మల్ని పాడుచేస్తున్నాడు. నిన్నటి ప్రదర్శనంలో పాత్రధారులను కూడా వాడెరుగునట. కాస్తవివరాలు కనుక్కుందాం, తమరు వాణ్ణి తొందర చెయ్యకండి.

నిర్వా : ఈ మహానగరంలో యీ భద్రకుడికి తెలియని సంగతేలేదు. మీరు పరదేశీయులు కావటంచేత మిమ్మల్ని వాడు యిట్టె

మోసగించ గలిగాడు. కౌటిల్యులవారు నిన్న ఏమేమి శాకపాకాలు ఆరగించారో అడిగి చూడండి, వాడు తడుముకోకుండా చెప్పేస్తాడు... నువ్వింకా యిక్కడే వున్నావేమిరా ?

భద్రు : నన్నెక్కడికి వెళ్ళమన్నారు ? ఈ అయ్యలు పని ఏమన్నా చెబితే చేద్దామనే నేనూ చూస్తున్నా. ఏంపని చెబితే అది చేస్తా. నాటకం గురించి చెప్పరా బద్దరకా అంటే చెబుతా మరి, ఏం జేసేది ? పనన్నాక చెయ్యాలి సిందేగా :

(అతిధులు నవ్వుతారు)

1. అతి : మహాకవి నిన్నుచూస్తే నీకోసం ఒక నాటకమే రాసునేమోరా,

భద్రు : (నిట్టూర్చి) నాకంత అదురుష్టమే ఉంటే యిక్కడ అంటగిన్నెలు తోముతానా అయ్యలూ ?

2. అతి : ఎవరు చూశార్రా ? నీవుకూడా గొప్పవాడివై పోతావేమో.

నిర్వా : వృషలులు చక్రవర్తులయే కాలం. నాకు సెలవిప్పించండి, మళ్ళీ తమ దర్శనంచేస్తా.

1. అతి : (ఆర్చర్యంతో) ఔరా, యీ పెద్ద మనిషిరాజద్రోహికింద ఎప్పుడోపట్టుబడి పోతాడు.

భద్రు : (రహస్యంగా) మళ్ళీ ఎక్కడా అనకండి. ఈ పెద్దమనిషి ఒకప్పుడు యవనులతో చెవులు కొరికినవాడే. బ్రాహ్మడని వదిలేశారు. ఆ నందుల కాలంలో అయితేనా, కొరత వేసి ఉండేవారు.

3. అతి : అంతమాత్రాన ఆ రోజులు మంచి వసుకునేవు. నందులు ప్రజాపీడకులు. వారితో పీడ విరగడై పోయింది. దేశం శాంతిసౌభాగ్యాలతో తులతూగుతున్నది: విదేశీ శత్రువులు చెల్లాచెదరై పోయారు. అంతా ఆ బ్రాహ్మణోత్తముడి చలవ. ఆ మౌర్యమహారాజు చలవ.

1. అతి : అన్నట్టు, యౌగంధరాయణుడి పాత్ర చాలావరకు చాణక్యులవారే. గమనించారా ?

2. అతి : (ఆశ్చర్యంతో) నాకు తట్టలేదు సుమా, అయితే వత్సరాజంటే—

1. అతి : మీకు సందేహందేనికీ ? చంద్రగుప్తమహారాజే.

2. అతి : భేష్, భేష్.

3. అతి : మనకథ సాగనేలేదు. అంతా పాత కథే నందురూ ?

1. అతి : కొద్ది భేదాలున్నాయి. ఉదాహరణకు చెబుతా ... యౌగంధరాయణుడు మంత్రాలూ, తంత్రాలూ చెయ్యడు. వసంతకుడి రూపం మార్చటమూ అదీ ఏమీలేదు. రుమణ్వంతుడుకూడా ఉజ్జయినికి యౌగంధరాయణుడి వెంటనే వెళతాడు. వాసవదత్తను ఎత్తుకుపోయే ఆలోచన యౌగంధరాయణుడిదికాదు. వత్సరాజుది. అయ్యో, ఇలాటి మార్పులు చాలా ఉన్నాయి.

భద్రు : అయ్యలూ, గాత్తర సేవకుడి ఆస్యం మాట చెప్పారుకారు.

1. అతి : భద్రవతి మావటివాడి మాటేనా నువు చెప్పేది. వాడు గట్టి హాస్యగాడు సుమా.

భద్రు : కవిగారి నాటకాలన్నిట్లోనూ వాడు యేషం కడతాడు, అయ్యలూ.

3. అతి : నాటకం చూడకపోతే పోయాను. అలా నగరం తిరిగి మహాకవి దర్శనమైనా చేసుకుందామా ఏం ?

2. అతి : దివ్యమైన ఆలోచన చెప్పారు. స్నానాదికాలు కానిద్దాం, లేవండి.

* * *

పుష్య : రాగల బ్రహ్మసమాజంనాటికి మంచి ఉత్సవం ఏర్పాటు చేయాలని మహామంత్రుల వారికి మనవి.

ప్రాదే : పుష్యగుప్తులవారు తలుచుకుంటే సమాజం వైభవంగా జరుగుతుంది.

పురో : శత్రుభయం లేదుసరిగదా, అలాటి భయం ఏర్పడుతుందనే భయంకూడా లేని కారణంచేత ప్రకృతులు మహోత్సాహులై వున్నారు.

హాలు : నిన్నటి ప్రదర్శనం చూస్తుండగా నాకూ అదే అనిపించింది. భరతవాక్యానంతరం లేచివస్తుండగా ప్రజలు చెప్పుకునే మాటలు విన్నాను. యౌగంధరాయణుడు చాణక్యులవారేనని ఒకరన్నారు. కాకమరేవిటి ? ఇదంబ్రాహ్మ్యమిదం క్షాత్రం అన్న మాట ఆయనకే వర్తిస్తుంది...అన్నారు మరొకరు.

సుత్రు : అసలు మహాకవి ఏ నాటకంరాసినా అందులో వర్తమాన చరిత్ర ఉట్టిపడుతుంది. ప్రేక్షకులు అది గ్రహించి ప్రదర్శనాన్ని చూచి మరింతగా ఆనందిస్తారు.

ప్రాదే : ఆ శత్రుసేనాపతి దగ్గరికి సాహసంతో వెళ్ళి బెదిరించివచ్చిన ఖిల్లుడి వృత్తాంతం మహాకవికి నేనే చెప్పాను. మరుసటి వుత్సవమప్పుడు చూద్దునుగదా దూతఘటోత్కచం తయారయింది. ఆ నాటకాన్ని ఆయన పుడియన్నరకాలంలో రచించినట్టు వినికిడి. నిజానికి వ్యవధి కూడా లేదులెండి.

లాతు : మహాకవిగారి నాటకాలన్నీ నేను చూశాను. ఆనందించాను. అయితే

ఆయన మూలకథలను పూర్తిగా మార్చేస్తున్నారని ఒక ఆక్షేపణ వచ్చింది

సుబ్రు : కర్ణభారం, ఊరుభంగం, బాలచరిత మొదలైన వాటిని గురించేనా మీరనేది?

లాతు: అవి కొంతలోకొంతనయం. మధ్యమ తీసుకోండి — పూర్తిగా కల్పన. పంచరాత్రం తీసుకోండి — ఇంకా అన్యాయం. గోగ్రహణం పూర్తిగానే దుర్యోధనుడు పాండవులకి అర్ధరాజ్యం యిచ్చేసి సఖ్యం చేసుకుంటాడు.

ప్రాదే : (నవ్వి) పంచరాత్రం చూసే వారికి నిజంగా పాండవులకథ పట్టిందంటారా? చంద్రగుప్త మహారాజు నందవంశజురాలైన దుర్ధరను పెండ్లాడటంతో శత్రు వంశాలైన నంద, మౌర్య వంశాలు ఏకమయాయి. అదే పంచరాత్రంలో మహాకవి సూచించారు. ఆ నాటకం చివరచెప్పిన భరతవాక్యం ద్రోణుడిదా మహామంత్రి అయిన చాణిక్యుల వారిదా చెప్పండి చూస్తాం.

సుబ్రు : చక్కగా సెలవిచ్చారు. నిన్నటి ప్రదర్శనంలో నాకు వర్తమాన చరిత్ర తప్ప వేరేమీ కనిపించలేదంటే నమ్మండి.

హాలు : పిచ్చివాడి వేషంలో యౌగంధరాయణుడు...చంద్రుణ్ణి రాహువు పట్టాడు, చంద్రగుప్తమహారాజు జ్ఞాపకంరాలేదూ? రాహువు ఎవరై ఉంటారా అన్నది అంత స్పష్టంగా లేదు. ధననందుడి మంత్రి రాక్షసుడు కావచ్చునేమో.

సుబ్రు : అలా అదీ, యిదీ అని ఎంచకండి. నాటకమంతా చరిత్ర స్ఫురణలే. యౌగంధరాయణ ప్రతిజ్ఞ వింటుంటే చాణుక్యులవారి ప్రతిజ్ఞ జ్ఞాపకం వచ్చింది. ఆనాడు వారు పాటలీపుత్రాన్ని పట్టుకోటానికి వస్తూ నందవంశ నిర్మూలనం చేయిస్తానని చేసిన ప్రతిజ్ఞమాట చెబుతున్నాను ... అలాగే వత్సరాజు ఏనుగు గురించి వింటుంటే ప్రసిద్ధమైన పౌరవుడి ఏనుగు స్ఫురించింది. అతనూ శత్రువునుభంజించిన మహావీరుడేగద... మహా మాత్రులేదో అనబోతున్నారు.

మహా : మీరంతాచెప్పేది పరమసత్యం. చాణుక్యులవారు మహాకవిని కలుసుకున్నప్పుడల్లా ఎందుకు పాదస్పర్శ చేయ యత్నిస్తారని మీ ఉద్దేశం? రెండు సందర్భాలలో వారిద్దరూ సోదరభావాలు కలవారయారు. నందుల క్షుద్ర పరిపాలనను చాణుక్యులవారు తెలుసుకోక పూర్వమే మహాకవి ఎరుగును. ప్రజాపీడకులైన ఆ నందులను ఆయన తీవ్రంగా ద్వేషించారు. తిరిగి, దేశాంతరాలనుంచి విజయకాంక్షతో వచ్చిన శత్రువును మహాకవి మనసారా ద్వేషించారు. శత్రువుయొక్క అపజయం కోరటంలో ఆయన మహారాజుకూ, మహామంత్రికీ ఏమాత్రమూ తీసిపోరు.

లాతు : వర్తమాన ప్రయోజనాలు మహాకవి రచనలలో పుష్కలంగానే వున్నాయి. ఎవరు కాదనగలరు? కాని భవిష్యత్తు విషయం ఆలోచిస్తున్నాను. వేదాలు ఎంతకాలం నిలుస్తాయో వ్యాస వాల్మీకి రచనలు అంతకాలం నిలుస్తాయిగద. వారి రచనలను తారుమారుచేసి, తాత్కాలిక ప్రయోజనాల నిమిత్తం రచించబడిన యీ నాటకాలు ఎంతకాలం నిలుస్తాయని నా సందేహం.

సుబ్రు : (ఉద్రేకంగా) వ్యాసుడికీ మహాకవికీ పరీక్షపెట్టండి. ఇద్దరి రచనలనూ అగ్నిలోవెయ్యండి. వ్యాసరచన బూడిద అవుతుంది. మహాకవి రచన నిలబడుతుంది.

లాతు : (నవ్వి) మీ విశ్వాసానికి ఆధారమేమిటి?

సుబ్రు : అడిగారుగనుక చెబుతున్నాను. పాండవకథ తీసుకోండి. భారతయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో సమస్తమూ తుడిచిపెట్టుకు పోయింది. ప్రపంచంలో ఉండిన దృఢకాయులందరూ చచ్చారు. అల్పులూ, అర్భకులూ మిగిలారు. మానవచరిత్రలో ఇంతకంటె హీన పరిస్థితి ఉండబోదు. ఇది ఎందుకు నివారించబడలేదూ అని మీ రెన్నడైనా ప్రశ్నించుకున్నారా? దుర్యోధనాదులు నందులకన్న హీనులా? భీష్మ ద్రోణ విదుర సంజయాదులు ప్రాజ్ఞులుకారా? వారికి మానవజాతిపట్ల ఎలాటి ధర్మమూ లేదా? వారా ధర్మాన్ని ఎలా నిర్వర్తించారు? ఒక్క, ఒక్క బ్రాహ్మణుడు — యిల్లూ వాకిలీ లేనివాడు— అంగబలమూ, అర్థబలమూ సమకూర్చుకుని, నందవంశ నిర్మూలనంచేసి, సుఖప్రదమైన జీవితం భూమండలమంతా ఏర్పాటు చేశాడే. ఇందులో శతాంశం చేయగల పాత్రను వ్యాసుడు సృష్టించగలిగాడా?

(అందరూ చప్పట్లు కొడతారు)

మహాకవిది అతిసుకుమారమైన మనసు. ఆయన చిన్న చిన్న అన్యాయాలనుకూడా సహించలేడు — చరిత్రలో కానివ్వండి, సారస్వతంలో కానివ్వండి. అందుకే ఊరుభంగ నాటకం. ఆయన ప్రతిమా నాటకం రాశారు. చదవగా విన్నాను. నాటక కథ బయట పెట్టను. ప్రాచీన సారస్వతంలో దుష్టురాలుగా చిత్రించబడిన ఒక పాత్రను ఆయన

ఎలా సమర్థించారో తలుచుకుంటే - ఇదుగో చూడండి - నా రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. కవిఅంటే ఆయనే కవి. సృష్టి అంటే ఆయనదే సృష్టి.

ప్రాదే : మరొక గొప్ప విషయం కూడా చెప్పుకోవాలి. జైన బౌద్ధ కవులలాగా ఆయన తన మతతత్వాన్ని రచనలలోకి ఎక్కించలేదు. ఆయన నాటకాలలో సంఘధర్మమూ, పౌరధర్మమూ, మానవధర్మమూ ఉంటాయిగాని, మతధర్మాలు లేవు. ఆయన వైష్ణవుడు, వేదశాస్త్రాభిమాని. చంద్రగుప్త మహారాజేగాక మౌర్యులే వేదవిహిత ధర్మాలకు ఏనాడో దూరమయారు. మహారాజుకు మహావీరమతాభిమానం వున్నట్టు వినికిడి. ఈ వ్యత్యాసాలేవీ మహాకవిని కించత్తయినా బాధించవు.

సేవకు : అయ్యా...

మహా : ఏమిరా ?

సేవ : మహామంత్రివారి సేవకుడు వచ్చాడయ్యా. నటులచేత నాటకం చదివించబోతున్నారట. సపరివారంగా తమరిని రమ్మని చెప్పమన్నారంటయ్యా.

మహా: అంతకంటేనా?తామంతావస్తున్నారా?

అంతా : వస్తున్నాం.... ఆమాటఅడగాలా.. ఎంతగొప్ప అవకాశం....

* * *

(నటులచే ప్రతిమానాటిక పఠనం)

తాపసి : నందిలకా ? నందిలకా ...

నందిల ; అయ్యా, వచ్చా.

తాప : త్రైలోక్యవిద్రావణుడైన రావణుణ్ణి సంహరించి, రాక్షసులలో తప్ప పుట్టిన విభీషణుడికి రాజ్యాభిషేకంచేసి, విమల చరిత్ర ఆయిన సీతాదేవివి,వెంటబెట్టుకుని రాక్షస వానర ముఖ్యులలో శరచ్చంద్రాభిరాముడైన రాముడు వస్తున్నాడుగదా, వారందరి ఆతిథ్యానికి ఏర్పాట్లు పూర్తి చేయమని కులపతిగారంటున్నారు.

నంది: అన్ని ఏర్పాట్లూ అయాయి కానీండీ—

తాప : అయితే ఏమిటిమరి ?

నంది : విభీషణ బంధువులు రాక్షసులు. వారి భోజనంవిషయం కులపతిగారేమంటారో

తాప : ఏం ?

నంది : వారేం తింటామంటారో.

తాప : భయంలేదు. వారంతా విభీషణ విధేయులే.

నంది : సజ్జనులైన రాక్షసులకొక్క నమస్కారం.

(అంతా నవ్వుతారు)

తాప : అదుగో వచ్చాడు రామచంద్రప్రభువు.

రాము : బలవీరసంపన్నుడైన రావణాసురుణ్ణి సంహరించాను. విశుద్ధవర్తన గల సీతను తిరిగి పొందాను. గురువుల ఆజ్ఞ నెరవేర్చాను. ఈ ఆశ్రమంలో మళ్లీ అడుగుపెట్టాను.

తాప : అమ్మా, సీతా, నీవు తపస్వినులమధ్య ఏకాకిగా ఉంటే చూడలేకుండా ఉన్నాను. నీ భర్తచెంతకు వెళ్లు తల్లీ.

సీతా : ఇప్పటికింకా ఇదంతా కలలాగేఉంది. ఆర్యపుత్రులకు జయం.

రాము : మైథిలీ, యీ జనస్థానంలో ఒకప్పుడు మనం నాటిన యీ వృక్షాలను గుర్తించావా ?

సీత : గుర్తించాను. కాని ఆనాడు నిలబడి చూస్తే వాటిమీది ప్రతి ఆకూ కనబడేది. ఇప్పుడు తలఎత్తి చూడవలసి వస్తోంది.

రాము : అలాగే జరుగుతుంది, కాలం ఎన్నో ఎగుడు దిగుళ్లు కల్గిస్తుంది. భరతుడు వచ్చినప్పుడు బెదిరిన లేళ్ల గుంపు జ్ఞాపకం ఉన్నదా ? మనవెంట తాబేలుండేది. బంగారులేడి కనిపించినప్పుడు మనం యిక్కడే కూచుని మాట్లాడుకున్నాం గదూ ?

సీత: (భయంగా)అదంతాజ్ఞాపకంచెయ్యవద్దు.

రాము : భయపడకు,అదంతా గతం...ఏమిటీ ధ్వానాలు ? ఒక్కసారిగా ఆశ్రమం నగరంలా అయిపోయిందే.

లక్ష్మ : ఆర్యపుత్రులకు జయం. పెద్ద సేనతోనూ, తల్లులతోనూ, భరతుడు మీ దర్శనానికి వస్తున్నాడు.

రాము : మైథిలీ, భరతుణ్ణీ, తల్లులనూ కళ్లు చారెడుచేసుకుని మరీ చూడు.

సీత : భరతుడు మంచిసమయానికే వచ్చాడు.

భరతు : అన్నా, కష్టాలనుంచి విముక్తుడవైన నిన్ను చూస్తే నాకు చాలా ఆనందంగా వుంది. ఇప్పుడు నీవు మబ్బులచాటునుంచి బయటికి వచ్చిన చంద్రుడిలాగున్నావు.

సుత్రు : (రహస్యంగా) మహాకవి చంద్రగుప్తకాదు, కాదు చంద్రుణ్ణి ఒక్కక్షణం మరిచిపోరు, మనని మరిచిపోనివ్వరు.

రాము : తల్లులకు అభివాదం.

తల్లులు : చిరంజీవ. మీరందరూ కుశలంగా ఉన్నందుకు చాలా సంతోషం.

రాము : ధన్యుణ్ణి.

లక్ష్మ : తల్లులకు అభివాదం.

తల్లులు : చిరంజీవ.

లక్ష్మ : ధన్యుణ్ణి.

సీత : ఆర్యలకు నమస్కారం.

తల్లి : బిడ్డా, చిరమంగలాభవ.

సీత : ధన్యురాలిని.

భరతు : అమ్మా, నేను భరతుణ్ణి, నమస్కారం.

సీత : చిరసందారభవ.

భరతు : ధన్యుణ్ణి. అన్నా. రాజ్యం స్వీకరించు.

రాము : ఏం నాయనా ?

కైకేయి : నా చిరకాలవాంఛ తీరటానికి. తండ్రీ.

శత్రు : సీతారామ లక్ష్మణులకు అభివాదం.

రాము : ఆయుష్మాన్ భవ.

సీత : చిరంజీవ.

లక్ష్మ : ఆయుష్మాన్ భవ.

శత్రు : ధన్యుణ్ణి. అన్నా. వశిష్టదేవాదులు ప్రకృతులను వెంటబెట్టుకుని అభిషేక జలంతో నీ దర్శనార్థం వచ్చి వున్నారు. వారంతా నీ రాజ్యాభిషేకం చూడాలని తొందరపడుతున్నారు.

కైకేయి : వెళ్ళు నాయనా. అభిషేకం చేయించుకో.

రాము : తల్లిగారి ఆజ్ఞ.

భర : అమ్మా, రామపట్టాభిషేకానికి ఇంతగా ఆత్రపడేదానివి రామున్ని అడవికెందుకు పంపావు ?

కైకే: ప్రారబ్ధం నాయనా, మీ తండ్రిగారికి ఆ మునిపెట్టినశాపం ఇంత చేసింది. పుత్ర శోకంతో మీ తండ్రి చావవలసి ఉంది గనకనే రామవనవాసం అన్నమాట నా నోటవచ్చింది. రాజ్యకాంక్షతో నేను నీకు రాజ్యం కోరాననుకున్నావా ?

భర: అయితేమటుకు రాముడికి పధ్నాలుగేళ్ళ వనవాసమా, అమ్మా ? ఎంత ఘోరం.

కైకే: (నిట్టూర్చి) పధ్నాలుగు రోజులు అన బోతే నోటివెంట పధ్నాలుగేళ్ళని వచ్చింది. నాయనా.

(ప్రేక్షకులలో హాహాకారాలు)

భర: అదుగో రాముడు,కిరీటఛత్రాలు ధరించి శుక్లపక్ష చంద్రుడివలె వెలుగుతున్నాడు.

శత్రు: చంద్రోదయం కాగానే చీకట్లు నశించి ప్రశాంతం కలిగినట్టుగా ఇక్ష్వాకు వంశం తన మాలిన్యాన్ని పోగొట్టుకొని వెలుగొందుతున్నది.

రాము:అదిగో పుష్పకం వచ్చింది. అందరూ ఎక్కండి. అయోధ్యకు పోదాం.

లక్ష్మ : ఇవాళ అయోధ్యావాసులు నిన్ను చుక్కలమధ్య చంద్రుడులాగా చూసి పరమానంద భరితులవుతారు.

మహా : యథారామశ్చ జానక్యా—బంధుభిశ్చ సమాగతహః
తథాలక్ష్మసమాయుక్తో— రాజాభూమిం ప్రశాస్తునః.

(హర్ష ధ్వానాలు)

[ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంవారి సౌజన్యంతో]

గ్రాములు : 'నెక్‌టైల్స్'

ఫోను : ఆఫీసు : **251007**
ఫ్యాక్టరీ : **77160**
సేల్స్‌డిపో : **332571**

ఎన్. ఇ. సి.

పెంకులు

నేషనల్ టైల్స్ అండ్ ఇండస్ట్రీస్ (ప్రైవేట్) లిమిటెడ్

చలువరాతి వర్ణచిత్రాలు, టెర్రజ్జో, సాదా సిమెంటు పెంకులు, జారుడుగా వుండని సిమెంటు పెంకుల ఉత్పత్తిదార్లు

కార్యాలయం : 31, హమామ్ వీధి, డెనా బ్యాంకు హౌస్ బొంబాయి — 1.

సేల్స్‌డిపో : 488, డంకన్ రోడ్, బొంబాయి — 4

ఫ్యాక్టరీ : ఎ-44, అంబేవాడి, పరెల్ టాంక్ రోడ్, బొంబాయి — 33